# ఆంధ్ర శుద్ధి

" తెనుగుతల్లీ !—తేరేచరణో సమర్పయామి నాగులావి
అబ్ సమర్పయామి క్రొంబడ్ తెనుగుతల్లీ జేజే! జేజే!"

బుచ్చిరామయ్య కృష్ణామండలంలో పుట్టి, తూర్పుగోదావరిమండలంలో చదివి, పశ్చిమ గోదావరీ మండలంలో ఉద్యోగకాలం అంతా వెళ్ళబుచ్చి, యిప్పుడు రిటైరై పింఛనుతీసుకుంటూ, "అరవై యేళ్లై చదువుకోక మన్నుగొట్టనా" అన్నసామెత అక్కఱ కొచ్చేటట్టు,—పునః బారసాలై అనగా తిరిగి పేరుంచబడ్డ—రాజమహేంద్రంలో, హిందీచదువు క్రొత్తగా ప్రారంభించాడు. ఎందుకయ్యా ఇప్పుడీవిద్య అంటే అతని సమాధానం పైవాళ్లు ఎన్నిసార్లు అడిగినా వొక్కటే సమాధానం. "చూడండీ! వచ్చింది అఖిలభారత జాతీయప్రభుత్వం. పుచ్చుకునేది వారి నుండి ఫింఛను. ఏయెండకు ఆ గొడుగు పట్టమన్నాడు; ఫింఛను తీసికొన్నప్పుడు సంతకం కనక హిందీ అక్షరాల్లోచేస్తే మఱి పదికాలాలపాటు పింఛను వస్తుందని నా ధీమా." ఇదీ అతని సమాధానం పైవాళ్ళతో. కాని అవకాశం చిక్కినప్పుడు వదలి పెట్టక పెళ్ళాంతో యింట్లో సరాగాలాడ్డానికూడా దాన్నే వుపయోగించడానికి వెనుదీశేవాడుకాడు.

పెళ్ళాంకో యేభైయేళ్లుంటాయి. ఆమె ఎప్పుడూ మొగానికి పెదకాసంత కుంకుంబొట్టెట్టుకు కాఫీ దగ్గర్నుంచీ మడిగా కాచి గవిరిదేవికి నైవేద్యం పెడితేనేగాని తాగననే మహాయిల్లాలు. మగని కొత్తబాససరాగం విన్నప్పుడల్లా ఆమె తన అడ్డబాప దిద్దుకుంటూ "నా కెందుకండీ ఆకాసావాళ్ళబాస,

ఆ గుర్రాల్ని తోలేవాళ్ళబాస హైహూ!" అనేది. అప్పుడు బుచ్చిరామయ్య ఇంట్లో ఆడవాళ్ళకు సమాధానం చెప్పేమాదిరిగా చెప్పేవాడు. "మనం మాట్లాడుకుంటూవుంటే యీ కొత్తభాష, ఇదివఱకు వాళ్ళకు అబ్బకపోయినా యీపైని మనకు పుట్టబొయ్యే పిల్లలకైనా అలవడుతుంది. అప్పుడు భావిభారతఖండ మంతా ఏకమై వొకత్రాటిమీద నడుస్తుంది." అని నమ్మకంగా బోధించేవాడు.

ఆర్గుమెంట్సప్పుడు ఏలాచెప్పినా వొప్పుతుంది కాని ప్రాక్టికల్సైడున పడేపాట్లు గమనించాలి.

ఫైవ్ ఎ. ఎమ్. కు అల్లా వోనాడు బుచ్చిరామయ్య హిందీపుస్తకం వొకటి చేతబట్టి పడక్కుర్చీలో కూర్చుని "కా" గుణితంకాణ్ణుంచి "హా" గుణితందాకా మొదటిపాఠంగా వర్ణక్రమం చూచుకు పోతున్నాడు పడక్కుర్చీలో. అతగాడు కూర్చుంటే వీధి కనబడుతుంది.

వీధిలో అప్పటికప్పుడే పాలమ్ముకునేవాళ్లు పచ్చడికాయ లమ్ముకునేవాళ్లు తిరిగి తిరిగి అమ్ముకుంటూవున్నారు. అయితే అమ్ముకునేవాళ్లు అందఱూ ఆకర్షింపుగా వుంటారా? ఉండరు. ఎవళ్లో కొందఱే వుంటారు. అప్పలమ్మ అనే గొల్లపిల్ల "ఎదుగులోను పొదుగులోను నిరిటికీ యీ యేటికీ ఎంత తేడావుంది దానిలో" అని అంతా అనుకునేమాదిరిగా మట్టెనుంచి మేలింపూస దాకా వయస్సొచ్చిందై, ఆకారం ఆచ్ఛాదనం మారిందై సుబ్బన్న అనే వో తోడివర్ణపు యువకుణ్ణి మాఱుబేరగాణ్ణి అడుగుతోంది.

"బలేవాడివి! ముందుడబ్బో? ఆఁ ఆఁ" అని. దానికీ వాడికీ అసలు సంభాషణ ఎక్కడ ప్రారంభమైందో మనకు

తెలియదు. వాడు ఆ సుబ్బన్న చెయ్యెత్తి చొరవగా దానిగంప లోంచి—అదివ్వనంటూన్నట్టు తొలగిపోతూవున్నా – పాలముంత వొకటి పైకి తీశేడు. వాని వెనకాతలే వుందికమోసు అప్పలమ్మ తల్లి—అదేమన్నా సుబ్బన్నకండువా పట్టుకు "వెళ్లు ఈసారి. ఆ పాలట్టు కెందాకా వెడతావో చూస్తాను. ఈ వఊకు పుచ్చు కున్న పాలకు డబ్బులివ్వవైతివి. మళ్లీ పిల్లను ఇబ్బంది పెట్టి పట్టుకుపోతుంటివి. ఏం. ఊరికే వస్తున్నాయనుకుంటున్నావా పాలు మాకు?" అని నిల్దీసి అడిగింది. సుబ్బన్న "మీవి పాలే? నీళ్ళేకదంటే. నీళ్ళకూ_డాడబ్బులేనా?" అన్నాడు.— అల్లా మాటకు మాటకు పెరిగి పోనాది ఓలమ్మా—ఎందాకైనా వెళ్ళిపోయింది నాటి ధూకుడు పాలమ్ముకునేవాళ్ళల్లో ఆ వుదయం ఆ రోడ్డుమీద. ఒకతిట్టుకాదు ఒకతిమ్మకాదు. రిగ్యులర్ న్యూసెన్సు అయిపోయింది బ్రాహ్మణవీధిఅంతా వాళ్ళ అవాచ్యపు కలహంతో. ఎవడికి శక్యం? పాటకపుజనం విడివడి గోల చేస్తున్నారు అంటే ఆప నెవరికి శక్యం? ఎలా ఆగిపోయిందో ఆగిపోయింది అంత శబ్దమూను హఠాత్తుగా.

బయటికి వెళ్ళి చూచాడు తన కుడిచేతితర్జని కితాబ్ మేం సబక్‌కా కా గజ్‌పర్ ఆనవాలుగా వుంచుకొని బుచ్చిరామయ్య. బుచ్చిరామయ్యకు కనబడ్డ దృశ్యమిది. ఆ గొల్లవాళ్ళ గుంపులో జొరబడి మునిసిపల్ హెల్తు ఆఫీసరు పిడత పిడత లేక్టోమీట రెట్టి చూస్తున్నాడు. "పదండి మేజెస్ట్రేటు కోర్టుకు; ఇవ్వండి పేర్లు" అని అంటూ అన్నాడు. బుచ్చిరామయ్యను పిల్చి ఆఫీసరు "అయ్యా మీరు సాక్ష్యముండాలి ఈ కేసులో" అన్నాడు: "ఎందుకు" అన్నాడు బుచ్చిరామయ్య. "అల్లాకాదు

వుండాలి. దేశక్షేమం కోసం, పురజనుల సౌఖ్యంకోసం, మీపిల్లల ఆరోగ్యం కోసం మీరు తప్పక యీ కేసులో సాక్ష్యం ఇవ్వాలి. ఇవ్వకతప్పదు." అన్నాడు మాటవొత్తి.

గొల్లవాళ్ళంతా అంతవఱకు తమలో తాముపడ్డ లడాయి అంతా మఱచిపోయి ఏకమయి అందఱూ వొక్కకంటిఱెప్పకిందకు చేరుకున్న వాళ్ళకుమల్లే చూస్తూ నిలబడిపోయినారు బుచ్చిరామయ్య చుట్టూ ఆఫీసరుచుట్టూ. బుచ్చిరామయ్య అన్నాడు "ఎందుకుసాక్ష్యం? ఏమనిచెప్పాలి నేను" అని. ఆఫీసరు ఓపాల ముంతలో పాలు చూపి "దీనిలో ఎన్నినీళ్లు వున్నాయో మీరు ఈ మీటరులో గమనించి చెప్పాలి" అన్నాడు. బుచ్చిరామయ్య "అందులో నాకు నీళ్లూకనబడ్డం లేదు. పాలూ కనబడ్డంలేదు. బూతులాట తుంపర్లు కనబడుతున్నాయి. వాళ్ళమీద అధికారిగా మిమ్మల్ని వేసేకన్న వోపోలీసును వేస్తేమెరుగు. ఇందాకట్నుంచీ వొక్కటే రణగొణధ్వని. అశ్లీలధోరణి." అని ఇంకా ఏకరువు పెట్టి ఏదో చెప్పబోతున్నాడు. బుచ్చిరామయ్య.... అంతలో బుచ్చిరామయ్య యింట్లోంచి వోకేక. అతని భార్య తనచేతిలో కాఫీకప్పెట్టుకు ఇంట్లోంచి సంబోధిస్తూంది. "ఏమండోయి: కాఫీ చల్లారిపోతూవుంది" అని. అది విన్నాడు కన్నాడు బుచ్చిరామయ్య. "ప్యారీకీ హాథ్ మేఁ కాఫీ హై. మై జాతా హూఁ" అంటూ ఇంట్లోకి వెళ్ళిపోయినాడు. హెల్తుఆఫీసరు, బుచ్చిరామయ్య అలా అంటూ పోతూవుంటే, మఱోసారి పాలకేసి చూస్తూ "ఈ పాలలో వెంౘ్రుకలుకూడా వున్నాయే నీళ్లేకాకుండా. ఇవి గొఱ్ఱెనీళ్లు మేకనీళ్ళూ కూడనా? దానికి వేఱేసాక్ష్యమే అక్కర్లేదు. నడవండి" అంటూ వాళ్ళందర్నీ కొట్టుకుపోయినా డెక్కడికో.—మఱి ఆ సందర్భం మఱచిపోండి పాఠకులు.

బుచ్చిరామయ్య ఇంట్లోకి వెళ్ళి మైఁ—మైఁ—మైఁ—అంటూ మైఁ తరువాతను "వచ్చాను," "త్రాగాను," "మళ్ళీపోయేను," అనే క్రియాపదాలు చేష్టలవల్లనే సాగించి వెనక్కు తిరిగేడు. వెనక్కుతిరిగిన పెనిమిట్ని తనగాజుల చప్పుడుచే ఆపిందై "మీకొచ్చిన యేళ్ళా ఎవరికొచ్చాయండీ! పామరుల బండ బూతులా పొద్దున్నే వినవలసింది! పొద్దున్నే స్మరించవలసింది." అని మందలించింది. "తుంభీ?" అన్నాడు బుచ్చిరామయ్య "నే కాకపోతే ఎవరుమందలించేదింక మిమ్మల్ని?" అంది గవిరిదేవి పీఠం దగ్గఱ అప్పటికప్పుడే తాను స్నానంచేసుకు పువ్వులూ అక్షతలూ అమర్చుకొంటూ.

బుచ్చిరామయ్య "బూతన్నది భావానికిగాని భాషకు లేదు" అన్నాడు. "వెనకటికి నేను కాలేజీలో చదువుకునేటప్పుడు రోమకవీరుని పేరొకటొచ్చేది. దాన్ని "సలా" అని మాహిస్టరీ చెప్పిన దొరగారిచేత అనిపించడానికి కొన్నివందల యేళ్లు పట్టింది. మఱోఅప్పుడు వో అరవఅయ్యర్ ప్రొఫెసర్ "లూయీ ది ఫోర్టీన్తు" రాజుకు మైనారటీ వదిలింది అని తెనుగున చెప్పడానికి "లూయీ ది పద్నాలుగు పెద్దమనిషి అయింది" అని వూరుకున్నాడు.—"ఎక్కడండి అది" అని అడిగింది భార్య. బుచ్చిరామయ్య "ఆంధ్రావిమెన్సు కాలేజీలో" అన్నాడు. "మఱి మన ఆడపిల్లకాయలంతా నవ్వలే?" "నవ్వకేం? చచ్చేటట్టు నవ్వేరట" నవ్విఅన్నారట "ప్రొఫెసర్‌గారూ! మగాడు పెద్దమనిషి అవడం ఏమిటి? అని అడిగారట పెద్దమనిషి. పెద్ద, బడా అన్నాట్ట ప్రొఫెసర్. అప్పటికీ నవ్వారుట వాళ్ళు. అయ్యర్ "ఆడవాళ్ళ

పెద్దమనుష్యులు గారు. మగవాళ్ళే పెద్దమనుష్యులు." అని కోపంపడ్డాట్ట. ఇంకా పిల్లలు నవ్వుతూవుంటే డైరక్టర్ను కోరు కొని ఆ కళాశాలనుంచి ట్రాన్స్ఫర్ చేయించుకున్నాట్ట."

"ఆఁ ఆఁ. పెద్దమనిషి అయింది అంటే అర్థంకాక నేనా ఊరునుంచి వూరుబదలాయించుకున్నది ఆ బడిపంతులు?" అని అడిగింది బుచ్చిరామయ్యను బుచ్చిరామయ్యభార్య. అడుగుతూ తన గౌరీదేవిపూజ ప్రారంభించి చేసుకుంటూవుంది. 'పసుపు కుంకుం సమర్పయామి. గౌరీమహాలక్ష్మీతల్లీ!' అని.

పూజాసమయాన్ని భార్య వాడిన తెనుగునకు పుబ్బిపోయి బుచ్చిరామయ్య హిందీపుస్తకం ఆవలపెట్టి మాతృభాషలో పద్యానికి ఉద్యుక్తుడయినాడు. ప్రథమయత్నంగా

"తెనుగుతల్లీ!"
తేరేచరణోం సమర్పయామి.
నాగులాబి అబ్ సమర్పయామిక్రొంబడ్
తెనుగుతల్లీ జేజే! జేజే!

అని ఉద్రిక్తుడైనాడు. బృందగానం 'తెనుగుతల్లీ! జేజేజేజే! జేజేజేజే! జేజే!

.... .... .... .... ....

## జాతీయత

"జాతీయత యనేది ఎక్కడుందీ
మనవాళ్ళల్లో? అంతటా చచ్చింది"

అలాగే 'అంతటా చావలేదు. ఇంకా కొందటి కొందటి హృదయాల్లోవుంది' అన్నాడు మిత్రుడు వెంకటరత్నం.